క్లుప్తంగా

సిద్ధేశ్వరుడికి నాగాభరణం బహూకరణ



నాగాభరణాన్ని అలంకరించిన దృశ్యం

వెల్దుర్తి: పట్టణంలోని కొలంబావి వద్ద కొలువైన సిద్ధేశ్వరుడికి పట్టణానికి చెందిన మానవపాటి సుధీర్ రెడ్డి కుటుంబ సభ్యులు నాగాభరణం అందించారు. సోమవారం సుధీర్‌రెడ్డి కుటుంబ సభ్యులతో 2కేజీల, రూ.2.50లక్షల పైచిలుకు విలువ గల వెండి నాగాభరణాన్ని అందజేయగా..అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారికి అలంకరించి విశేష పూజలు చేశారు.

క్షయపై అవగాహన



మైనింగ్ ప్రాంతంలో క్షయపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తుగ్గలి : జియో మైసూర్ సర్వీసెస్ గోల్డ్ మైనింగ్ కంపెనీ ఆధ్వర్యంలో సోమవారం క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జొన్నగిరి, పగిడిరాయి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు, మైనింగ్ ప్రాంతంలో ఉద్యోగులు, కూలీలకు క్షయ వ్యాధి లక్షణాలు,నివారణపై అవగాహన కల్పించారు. పీఆర్వో రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న రమణ

మద్దికెర : పేద ప్రజలకు సబ్సిడీతో అందజేస్తున్న నిత్యావసర సరుకులను సక్రమంగా ప్రతి ఇంటికీ పంపిణీ చేయాలని జిల్లా సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ రమణ తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో లబ్ధిదారులకు సకాలంలో రేషన్ అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ హుసేన్‌సాహెబ్, ఆర్‌ఐ రవికుమార్, వీఆర్వోలు, డీలర్లు పాల్గొన్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం



పనులు పరిశీలిస్తున్న ఏఈ మయాంక్

మద్దికెర : స్థానిక సాయినగర్ కాలనీ వాసుల నీటి సమస్యకు శాశ్వతం పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ తెలిపారు. సోమవారం కాలనీలో జరుగుతున్న పైపులైన్ పనులను పరిశీలించారు. జల్‌జీవన్ మిషన్ కింద రూ.1.84 కోట్లతో గ్రామంలో నాలుగు నీటి ట్యాంకులతో పాటు సాయినగర్‌లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు పనులు పైపులైను పనులు, వాల్వ్‌లు అమర్చే పనులు శరవేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. ఇప్పటికే ట్యాంకుల నిర్మాణం పూర్తయ్యిందని, త్వరలోనే నీటిని పంపింగ్ చేసి ఇళ్లకు సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక..



హులేబీడులో హీరామోహినుద్దీన్ దర్గాలో మొక్కులు తీర్చుకుంటున్న గ్రామస్తులు

ఆలూరు రూరల్: మండలంలోని హులేబీడు గ్రామంలో మతసామరస్యానికి ప్రతీకగా పేరొందిన హీరామోహినుద్దీన్ ఉరుసు సోమవారం ఘనంగా జరిగింది. ఉరుసును పురస్కరించుకుని గ్రామస్తులు తెల్లవారుజామున గంధం వేడుకలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామస్తులు కులమతాలకు అతీతంగా వచ్చి తాతకు చక్కెర, పూలు,చాదర్ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వేడకల సందర్భంగా గ్రామమంలో కోలాహలం నెలకొందిది. నిర్వాహకులు దర్గా ఆవరణలో అన్నదానం ఏర్పాటు చేశారు.

సివిల్ సప్లయ్ గోదాం ఆర్‌ఐగా శివన్న

ఆలూరు: స్థానిక సివిల్ సప్లయ్ స్టాక్ పాయింట్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా శివన్న నియమితులయ్యారు. ప్రస్తుతం పత్తికొండ సివిల్ సప్లయ్ స్టాక్ పాయింట్ అధికారి జయరామిరెడ్డి ఇన్‌చార్జ్ ఆర్‌ఐగా విధులను నిర్వహించారు. ప్రస్తుతం శివన్న ఆలూరు ఎలక్షన్ డీటీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులను నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శివన్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

బ్రహ్మగుండేశ్వరుడి దర్శనం

సర్వ పాపహరణం

- నేటి నుంచి శివరాత్రి బ్రహ్మోత్సవాలు
- 26న జాగరణ, శివపార్వతుల కల్యాణం
- 28న రథోత్సవం

పట్టణ సమీపంలో రామళ్లకోట వద్దనున్న ప్రముఖ శైవ క్షేత్రం బ్రహ్మగుండం. ఇక్కడ కామేశ్వరీదేవి సమేత బ్రహ్మేశ్వరస్వామి మహిమాన్వితుడిగా విరాజిల్లుతున్నాడు. పాపహరిణిగా, సర్పదోష నివారిణిగా పేరుగాంచిన భక్తిరసాన్విత పుణ్య క్షేత్రంగా బ్రహ్మగుండం పేరుగాంచింది.



ముస్తాబైన బ్రహ్మగుండం క్షేత్రం,(ఇన్‌సెట్) బ్రహ్మగుండేశ్వరుడు

వెల్దుర్తి: ద్వాపర యుగంలో అర్జునుడి మునిమనుమడు జనమేజయ చక్రవర్తి బ్రహ్మేశ్వరుని ప్రతిష్ఠించాడు. శాపగ్రస్తుడైన తన తండ్రి పరీక్షిత్తు చక్రవర్తి తక్షకుడనే సర్పం విషాగ్నికి మరణిస్తాడు. తక్షకుడి పట్ల, నాగజాతి పట్ల కోపంతో ఉన్న ఉదంకుని ద్వారా తండ్రి వృత్తాంతం తెలుసుకుంటాడు జనమేజయుడు. సర్పయాగంతో సర్పనాశనాన్ని ఆరంభిస్తాడు. అభయం ఇచ్చిన ఇంద్రుడు సైతం తక్షకునితోపాటు యజ్ఞగుండంలోకి జారిపోనారంభిస్తాడు. ఆ సమయంలో సర్పలోక రక్షణకు అవతరించిన అస్తీకుడు అడ్డుపడతాడు. యజ్ఞశాలకు వెళ్లి జనమేజయుడిని మెప్పించి యాగాన్ని నిలుపుదల చేయిస్తాడు. సర్పాలను అంతమొందించిన తన పాపవిముక్తి కోసం జనమేజయుడు భారతావనిలో పలు ఆలయాలు నిర్మిస్తాడు. వాటిలో ఎక్కడా లేని విధంగా పడమర వైపు దర్శనంగా లింగాకృతిలో ప్రతిష్ఠించబడిన బ్రహ్మేశ్వరుడు ఒకడని స్థల పురాణం చెబుతోంది.

మరో కథనం..

సాక్షాత్తూ బ్రహ్మదేవుడు ఈ బ్రహ్మగుండంలో లింగాన్ని ప్రతిష్ఠించి అర్చించాడనేది మరో కథనం. సృష్టి ఆరంభవేళ పరమేశ్వరుడు విష్ణువును సృష్టించాక అతని నాభి నుంచి పుట్టిన కమలంలో ఐదు శిరస్సులు గల బ్రహ్మదేవుడు వెలిశాడు. విష్ణువు, బ్రహ్మలు తాను గొప్పంటే తాను గొప్పని వాదులాడుతుండగా వారి మధ్య ఒక మహా అగ్ని లింగం వెలుస్తుంది. దాని ఆది, తుది వెతుకులాటలో పడతారు ఇరువురు. ఆ లింగాకారం తుది చూశానని బ్రహ్మ అబద్ధమాడడంతో లింగాకృతిలోని పరమశివుడు కోపద్రిక్తుడై అతని ఐదు శిరస్సులలో ఒక శిరస్సు ఖండిస్తాడు. ఆ శిరస్సు తెగి పడింది ఈ బ్రహ్మగుండం క్షేత్రంలోనే అన్నది కథనం. బ్రహ్మ తన పాపపరిహారార్థమై తన శిరస్సు పడిన క్షేత్రాన లింగ ప్రతిష్ఠ చేసి యజ్ఞకుండం ఏర్పాటు చేసుకుని ఆరాధిస్తాడు. నాటి నుంచి ఈ క్షేత్రానికి బ్రహ్మకుండం, తదుపరి బ్రహ్మ గుండంగా రూపాంతరం చెందినట్లు చెబుతున్నారు.



బ్రహ్మగుండం పుష్కరిణి

నారద పురాణాన ఆలయ విశిష్టత..

ధర్మాంగదుడు దక్షిణ భారతదేశాన్ని పాలించాడు. సంతాన లేమితో సతి అర్మిలీ దేవి సమేతుడై యజ్ఞయాగాదులు నిర్వహిస్తాడు. అర్మిలీదేవి గర్భాన పాము పుడుతుంది. దీంతో ధర్మాంగదుడు, అర్మిలీదేవి పామును కొడుకులా పెంచుతారు. రత్నాంగుడనే మహారాజు కుమార్తె త్రైలోక్య సుందరికి ఇచ్చి పెళ్లి సమయాన వరుడు పరదేశం వెళ్లాడని మోసపూరితంగా కత్తికి బాసికం కట్టి పెళ్లి చేస్తారు. తన భర్త పాము అన్న విషయం తెలుసుకున్న త్రైలోక్య సుందరి పాము రూపంలోని భర్తను బుట్టలో పెట్టుకుని తలపై మోస్తూ తీర్థయాత్రలకు వెళ్తుంది. చివరకు పడమట దిశగా పోయి బ్రహ్మగుండంలో పాము పెట్టెతో సహా నువ్వు స్నానం చేస్తే పాము నరనాథుడవుతాడని మహర్షులు దీవిస్తారు. దీంతో త్రైలోక్య సుందరి బ్రహ్మగుండం చేరుకుని పాము రూపంలోని భర్తతో కలిసి పుష్కరిణిలో స్నానమాచరించి బ్రహ్మేశ్వరుని కొలుస్తుంది. అంతట శాపవిమోచనమైన పాము మానవాకృతి పొంది చిత్రాంగదుడన్న పేరుతో కొనియాడబడ్డాడని నారద పురాణం పేర్కొంటుంది. రామళ్లకోటను విడిది ప్రాంతం చేసుకున్న శ్రీకృష్ణదేవరాయల కాలంలో ఆలయ నిర్మాణం జరిగినట్లు ఇక్కడి సాలస్తంభాలు, కళాకృతులు చెబుతున్నాయి.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఆలయాభివృద్ధి..

ఆలయ ధర్మకర్తల మండలి కమిటీ చైర్మన్‌గా పట్టణానికి చెందిన బొమ్మన పెద్దిరెడ్డి, నాటి ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ టి.హనుమంతరావు ఆలయానికి పూర్వవైభవం తెచ్చేదిశగా కృషి చేశారు. దాతల సహకారంతో నాలుగేళ్లలో రూ.60 లక్షలకు మించి అభివృద్ధి జరిగింది.

మార్చి 1న బండలాగుడు పోటీలు..

మార్చి 1 తేదీన ఒంగోలు జాతి న్యూ కేటగిరి కోడెలకు అంతర్రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు బొమ్మన రాజశేఖర్ రెడ్డి తెలిపారు. విజేతలకు వరుసగా రూ.50,116, రూ.40,116, రూ.30,116, రూ.20,116, రూ.10,116 నగదు బహుమతి అందించనున్నట్లు తెలిపారు. పాల్గొనదలచిన వారు రూ.600ల ఎంట్రీఫీజుతో సెల్: 8309494022 నంబరులో సంప్రదించాలని కోరారు.

26 నుంచి ఉత్సవాలు..

ఈనెల 26న బుధవారం జాగరణ, అర్ధరాత్రి గం.12.10ని.లకు కల్యాణం, 27న ప్రత్యేక పూజలు, 28న సాయంత్రం రథోత్సవం, మార్చి 1న వసంతోత్సవం జరుగనున్నాయి.

బ్రహ్మసూత్ర లింగం..

పత్తికొండ రూరల్: రాజులమండగిరి ఆలయంలో పురాతన రామలింగేశ్వరాలయం మహాశివరాత్రి పర్వదినానికి ముస్తాబైంది. జనమేజయ మహారాజు సర్పయాగంలో భాగంగా రామలింగేశ్వరాలయాన్ని పడమర ముఖంగా ప్రతిష్ఠించాడు. ఇక్కడ కార్తీకం, శివరాత్రి పర్వదినాల్లో పూజలు నిర్వహిస్తారు.

చారిత్రక నేపథ్యం..

చారిత్రక ఆధారాలుగా మౌర్యచక్రవర్తి అశోకుడి శిలాశాసనాలు ఉన్నాయి. బౌద్ధ మత ప్రచార నిమిత్తం తిరుగుతూ ఈ క్షేత్రాన్ని సందర్శించినట్లు శిలా శాసనాలు పేర్కొంటున్నాయి. మాండవ మహారుషి ఇక్కడ తపస్సు చేయడం వల్ల మాండవగిరి, కాలక్రమంలో మండగిరిగా మారింది. పాండవులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో భీమసేనుడు ఈ ప్రాంతంలో శివలింగాన్ని ప్రతిష్ఠించినట్లు ఆధారాలు ఉన్నాయి. దేవాలయం ముందుండే కొలను నీటితోనే భీముడు శివలింగాన్ని అభిషేకించాడని స్థానిక కథనం. ఈదొన గూండా హోసూరు వీరభద్రేశ్వరస్వామి ఆలయం వరకు సొరంగ మార్గం ఉందని స్థానికులు పేర్కొంటారు.

పత్తికొండలో బ్రహ్మసూత్ర శివలింగం..

పత్తికొండలోని రెడ్డిబావి వీధిలో పురాతన శివాలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. ఇటీవల ఆలయ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ఈ ఆలయంలో శివలింగంపై బ్రహ్మసూత్రం ఉండటం ప్రత్యేకత. ఇలాంటి ఆలయాలు చాలా అరుదుగా ఉంటాయి. ఇలాంటి విశిష్టమైన ఆలయాన్ని ఒక సారి దర్శిస్తే వెయ్యిసార్లు దర్శించిన పుణ్యఫలం లభిస్తుందని పురాణ వచనం.

జనమేజయ మహారాజు ప్రతిష్ఠించిన శివలింగం →



ఆటపాటలతో కూడిన విద్యనందించాలి

పత్తికొండ రూరల్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని కోర్సు డైరెక్టర్, మండల విద్యాధికారి గాజుల రమేష్ అన్నారు. సోమవారం పత్తికొండలోని ఏపీ మోడల్ స్కూల్‌లో అంగన్‌వాడీ వర్కర్‌లకు రెండు బ్యాచ్‌లుగా జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులు నిర్వహించారు. డీఆర్‌పీలు సత్యనారాయణ, నాగభూషణం, జయరాముడు, టెక్నికల్ అసిస్టెంట్ అబ్దుల్ సులభతరమైన బోధనా పద్ధతులను వివరించారు.

ఆస్పరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మెరుగైన విద్యను అందించాలని ఏంఈఓ తిరుమలరావు సూచించారు. సోమవారం స్థానిక కేజీబీవీలో నిర్వహిస్తున్న జ్ఞాన జ్యోతి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన ఆకర్షణీయ బోధనాభ్యాసన సామగ్రిని పరిశీలించి అభినందించారు. మంగళవారంతో శిక్షణ కార్యక్రమాలు ముగుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శారోన్ స్మైలీ, డీఆర్‌పీలు నాగరాజు, వీరేష్, తులసయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శివలింగమ్మ, పద్మావతి పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలు తయారు చేసిన భోదనాభ్యాసప సామగ్రిని పరిశీలిస్తున్న ఎంఈఓ తిరుమలరావు

గడ్డివామి దగ్ధం

పత్తికొండ రూరల్ : పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఉన్న తుప్పద నాగన్నకు చెందిన గడ్డి వాముకి సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. అగ్నిప్రమాదంలో ఎద్దు స్వల్పంగా గాయపడగా, రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు నాగన్న వాపోయాడు.

హొళగుంద: స్థానిక సిద్దేశ్వరస్వామి ఆలయ సమీపంలోని కొండలో రైతు సిద్దప్పకు చెందిన గడ్డివాము సోమవారం ప్రమాదవశాత్తు కాలిపోయింది. స్థానికులు ఆలూరు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది గ్రామానికి చేరుకుని మిగిలిన గడ్డివాములు, గుడిసెలకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు.

వేదావతి ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలి

ఆస్పరి: ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఆలూరు నియోజకవర్గంలోని వేదావతి ప్రాజెక్టు నిర్మాణానికి రూ.వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ రామేశ్వరరెడ్డికి పార్టీ నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేదావతి, గుండ్రేవుల, ఆర్‌డీఎస్ కుడి కాల్వ నిర్మాణాలు చేపడుతామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, ఇప్పటి వరకు వాటి గురించి పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. నాయకులు విరుపాక్షి, విరుపాక్షి, కృష్ణమూర్తి, నల్లన్న, రామాంజిని, రంగప్ప, గోరంట్ల పాల్గొన్నారు.

హొళగుంద: అసెంబ్లీ సమావేశాల్లో వేదావతి ప్రాజెక్టుకు వెయ్యి కోట్లు కేటాయించి నిలిచిపోయిన పనులను పునఃప్రారంభించాలని సీపీఐ మండల కార్యదర్శి పెద్యాట మారెప్ప డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దారు నిజాముద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. మారెప్ప మాట్లాడుతూ 8.5 టీఎంసీల సామర్థ్యంతో వేదావతి ప్రాజెక్ట్‌ను నిర్మించాలని , ప్రాజెక్ట్ కోసం భూములు కోల్పోయిన బాధితులకు పరిహారం ఇవ్వాలని కోరారు. రంగన్న, కృష్ణయ్య, వెంకన్న, అబ్దుల్ సలాంసాబ్ పాల్గొన్నారు.



తహసీల్దార్ రామేశ్వరరెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

వైద్య వాహనాలు, బైక్‌లు ధ్వంసం

వెల్దుర్తి: స్థానిక సీహెచ్‌సీ ఆవరణలో పార్క్ చేసిన 104 వాహనం, ఆసుపత్రి డ్యూటీ డాక్టర్ సివిల్ అసిస్టెంట్ సర్జన్ వరప్రసాద్ కారు అద్దాలను గుర్తుతెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. పక్కనే పార్క్ చేసిన నాలుగు బైక్‌లను సైతం కిందకు తోసి పాక్షికంగా ధ్వంసం చేశారు. డ్యూటీలో ఉన్న తాను రాత్రి 2గంటల సమయంలో కారు అద్దాలు ధ్వంసమైనట్లు గుర్తించానని, పక్కనే ఉన్న వాహనాలు సైతం ధ్వంసం చేయడాన్ని గమనించానని డాక్టర్ వరప్రసాద్ తెలిపారు. 104 సిబ్బంది, డాక్టర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే.. రామళ్లకోట గ్రామం పుల్లగుమ్మి పేటకు చెందిన 11మంది రైతుల పొలాల్లోని వ్యవసాయ బోర్లకున్న విద్యుత్ వైరు చోరీకి గురైనట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. దొంగలు పలు చోట్ల స్టాటర్లను ధ్వంసం చేసి బోరు నుంచి స్టాటర్ వరకు వైరును ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు సోమవారం తెలిపారు.



డ్యూటీ డాక్టర్ కారు, 104 వాహనం ముందు అద్దాలు ధ్వంసం చేసిన దృశ్యం

ఔషధ గుణాల తాటి బెల్లం

పత్తికొండ(తుగ్గలి) : తమిళనాడు తాటి బెల్లం రుచి చూపిస్తోంది. ఔషధ గుణాలు ఉన్న తాటి బెల్లం కొనుగోలు చేసేందుకు ప్రజల ఆసక్తి చూపుతున్నారు. ఈ ప్రాంతంలో తాటి బెల్లం దొరకడం కష్టమైన తరుణంలో తమిళనాడుకు చెందిన కొందరు వ్యాపారులు తాటి చెట్ల నుంచి సేకరించిన తాటి నీరతో తయారుచేసిన బెల్లాన్ని కొందరు వాహనాల్లో తెచ్చి ఏటా పత్తికొండకు ప్రధాన రోడ్డు పక్కన వెదురు బుట్టల్లో ఉంచి విక్రయిస్తున్నారు. సాధారణ బెల్లం ధర కంటే మూడు రెట్లు అధికంగా తాటి బెల్లం ధర పలుకుతుండగా, ఔషధ గుణాలు మెండుగా ఉండటంతో ధర ఎక్కువైనా కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఇందులో గిన్నెల తాటి బెల్లం కిలో ధర రూ.120, అల్లం, మిరియాలు, సొంటి కలిసిన బెల్లం కిలో రూ.240 ప్రకారం అమ్ముతున్నారు.



పత్తికొండలో తాటి బెల్లం విక్రయిస్తున్న దృశ్యం

నోటీస్ బోర్డు

28న పత్తికొండలో జాబ్‌మేళా

పత్తికొండ రూరల్ : పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 28వ తేదీన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాధురి సోమవారం తెలిపారు. శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, గ్రీన్ టెక్ లిమిటెడ్ కంపెనీలు మేళాలో పాల్గొంటున్నాయన్నారు. పది నుంచి డిగ్రీ చదువుకుని 18–35 సంవత్సరాల్లోపు వయస్సున్న నిరుద్యోగ అభ్యర్థులు అర్హులని చెప్పారు. పూర్తి బయోడేటాతో పాటు విద్యార్హత, ఆధార్‌కార్డు, పాస్‌ఫొటోలను తీసుకురావాలని సూచించారు. నిరుద్యోగ యువతీ, యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సెల్ : 9603303354 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి ఫక్కీరప్ప స్వామి ఉత్సవాలు

వెల్దుర్తి: చెర్లకొత్తూరులోని తిమ్మగురుడు ఫక్కీరప్ప స్వామి ఉత్సవాలు ఈనెల 26వ తేదీ నుంచి ఘనంగా జరుగనున్నాయి. శివరాత్రిని పురస్కరించుకుని 26న జాగరణ, 27న గంగ పూజ, రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి ఎల్లయ్య తాత తెలిపారు. 28న నాలుగు పండ్ల విభాగం వృషభాలకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నామని, విజేతలకు వరుసగా రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేలు నగదు బహుమతి అందజేయనున్నట్లు చెప్పారు. అనంతరం గుండు ఎత్తు పందెం నిర్వహించి విజేతలకు వరుసగా 7తులాల, 5 తులాల వెండి, పరుగు పందెం విజేతలకు వరుసగా రూ.4తులాలు, 3తులాలు, 2తులాల వెండి పతకాలు బహూకరించనున్నట్లు వివరించారు. పాల్గొనదలచిన వారు సెల్ 6305295612, 9553047169 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

అర్హులకు ఇంటి పట్టా

తుగ్గలి : అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలంలో అనధికారికంగా అనుభవంలో ఉన్నవారు ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తహసీల్దార్ రమాదేవి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2019 అక్టోబర్ 15వ తేదీకి ముందు అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో అనుభవంలో ఉన్న వారు మాత్రమే ఇందుకు అర్హులన్నారు. అలాంటి వారు ఎవరైనా ఉంటే మార్చి 15వ తేదీలోగా గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులు విచారించి అర్హులకు ఇంటి పట్టా మంజూరు చేస్తామని స్పష్టం చేశారు.

చదువుల రామయ్యకు నివాళి

పత్తికొండ రూరల్ : నిరుపేదల పక్షాన నిలబడి పోరాటాలు చేసిన ఆదర్శప్రాయుడు కమ్యూనిస్టు నేత చదువుల రామయ్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య అన్నారు. సోమవారం స్థానిక సీపీఐ పార్టీ కార్యాలయంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన చదువుల రామయ్య 33వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఐ పత్తికొండ, తుగ్గలి మండల కార్యదర్శులు రాజాసాహెబ్, సుల్తాన్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఉమాపతి పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూ



ఆస్పరిలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ఎంపీడీఓ గీతావాణి

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపీడీఓ విజయలలిత, హొళగుంద ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్, హెబ్బటం ఆర్జీబీ మేనేజర్ గోపి తదితరులు పాల్గొని దరఖాస్తులను పరిశీలించారు. మొత్తం 50 యూనిట్లకు 423 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా దాదాపు 250 మంది ఇంటర్వ్యూకు హాజరైనట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఆస్పరి: సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ గీతావాణి, కైరుప్పల ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ రమేష్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ రుణాలకు ఎంపీడీఓ, మేనేజర్ దరఖాస్తు చేసుకున్న వారిని ఇంటర్వ్యూ చేశారు. మండలంలో 59 యూనిట్లు గాను 456 మంది దరఖాస్తు చేసుకున్నారని ఎంపీఈఓ చెప్పారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

హొళగుంద: పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాల, తల్లిదండ్రులకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని హెచ్‌ఎం నజీర్ అహమ్మద్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్కే గిరి విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక కస్తూర్బా విద్యాలయం , జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కేజీబీవీ విద్యార్థినులకు గిరి పెన్నులు, ప్యాడ్స్ అందజేశారు.



కేజీబీవీలో విద్యార్థినులకు ప్యాడ్స్ అందజేస్తున్న ఎస్కే గిరి

మహాశివరాత్రి విశిష్టతపై ప్రచారం

కృష్ణగిరి: ఈ నెల 26వ తేదీన జరుపుకునే మహా శివరాత్రి పండుగ విశిష్టత గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని త్రైత సిద్ధాంతం–ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక జోన్ కమిటీ అధ్యక్షుడు నాగార్జున కోరారు. సమితి సభ్యులతో కలిసి లక్కసాగరం గ్రామంలో సోమవారం ఆయన ఇంటింటికీ తిరిగి భగవద్గీత పుసకాలను అందజేసి మహాశివరాత్రి ప్రాముఖ్యతను గురించి ప్రజలకు వివరించారు. శివలింగంపై ఉండే మూడు విభూతి రేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మలకు గుర్తు అని, ఆత్మను ఆరాదిస్తే జీవుడు మోక్షం పొందుతాడన్నారు. సభ్యులు శివకుమార్, వెంకటేశ్వర్లు, శ్రీరాములు, సుంకన్న, శశికళ, మమత పాల్గొన్నారు.

ప్రతి రైతుకు యూనిక్ ఐడీ ఇవ్వాలి

వెల్దుర్తి: ప్రతి రైతుకు యూనిక్ ఐడీ ఇవ్వాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దాదిపోగు నవీన్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక మండల సమితితో కలిసి వినతిపత్రాన్ని తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మకు సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం కేవలం పట్టాదారు పాస్‌బుక్‌లు, రిజిస్టరు పత్రాలు, ఆన్‌లైన్‌లో ఉన్న భూయజమానులకు మాత్రమే వర్తింపజేస్తుండడంతో ప్రభుత్వ పథకాలు వారికి మాత్రమే అందే అవకాశముందన్నారు. డీ పట్టాలు సాగు చేసుకునే, ప్రభుత్వ భూములు సాగు చేసుకుంటున్న వారికి ఆన్‌లైన్‌లో నమోదు కాకపోతుండడంతో వారికి యూనిక్ ఐడీ లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ సమస్యల నివారణకు..

మద్దికెర : గ్రామంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా తీగల ఎత్తు పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ అహమ్మద్ రఫీక్ తెలిపారు. సోమవారం 11 కేవీ విద్యుత్ తీగలు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చేందుకు స్థలాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో వాటిని ఇతర ప్రాంతాల్లో అమర్చేందుకు, 11 కేవీ విద్యుత్ తీగలు వేసేందుకు ఎత్తైన స్తంభాలు ఏర్పాటు చేస్తామన్నారు. రమణ, బండారు ఆంజనేయులు, మాజీ ఉప సర్పంచ్ నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

నిర్మాణాల్లో నిబంధనలు పాటించాలి



రోడ్డును పరిశీలిస్తున్న డీఈ శేషయ్య, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి

మద్దికెర : సీసీ రోడ్ల నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలు పాటించి సకాలంలో పూర్తి చేయాలని పీఆర్ డీఈ శేషయ్య, జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక మహాత్మాగాంధీ సర్కిల్ నుంచి రెండు ఓహెచ్ ట్యాంకుల వరకు రూ.10 లక్షల జెడ్పీ నిధులతో వేస్తున్న సీసీ రోడ్డును పరిశీలించారు. ఏఈలు విష్ణు, చంద్రశేఖర్, కాంట్రాక్టర్ తాలూరు వెంకటేశ్వరరెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.